క్లుప్తంగా

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



పొదలకూరు : యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అలాంటి వాటిని ప్రోత్సహించే వారి వివరాలు అందజేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఈబీ జిల్లా సూపరింటెండెంట్ రవికుమార్ పేర్కొన్నారు. స్థానిక సెబ్ కార్యాలయంలో బుధవారం జరిగిన మోటార్‌బైక్ వేలంలో ఆయన పాల్గొని, మాట్లాడారు. వేసవి సెలవులు పూర్తయిన తర్వాత కళాశాలల్లో మత్తు పదార్థాల వినియోగం, వాటి వల్ల జరిగే నష్టాలను వివరిస్తూ సదస్సులు నిర్వహిస్తామన్నారు. మోటారు బైక్‌కు ప్రభుత్వ వేలం ధర రూ.4 వేలు నిర్ణయించగా పాటలో రూ.6,660 వచ్చిందన్నారు. అనంతరం పట్టుబడిన మద్యం, సారా తయారీకి ఉపయోగించే బెల్లంను సెబ్ అధికారులు, సిబ్బంది ధ్వంసం చేసి మురుగు కాలువలో పడవేశారు. కార్యక్రమంలో సెబ్ సీఐ వెంకటరావు, ఎస్సై శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి చెస్ పోటీలు

కోవూరు: కోవూరులోని శ్రీచైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్లో గత రెండు రోజుల నుంచి జరుగుతున్న రాష్ట్రస్థాయి ఓపెన్ చెస్ పోటీలు బుధవారం ముగిశాయి. పోటీల్లో గెలుపొందిన విజేతలకు డీఏఏబీ చైర్మన్ నిరంజన్‌బాబురెడ్డి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేవలం చదువులోనే కాకుండా క్రీడల పట్ల మక్కువ చూపాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం అధ్యక్షుడు మల్లవరపు చిరంజీవి, సచివాలయ మండల కన్వీనర్ కవరగిరి ప్రసాద్, బీసీ సెల్ అధ్యక్షుడు కేతా మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

వెంకటాచలం : అనుమానాస్పద స్థితిలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన వెంకటాచలం మండలం కాకుటూరు పంచాయతీ పరిధిలోని అటవీ ప్రాంతంలో బుధవారం వెలుగుచూసింది. పోలీసుల వివరాల మేరకు.. అడవిలోని శివాలయానికి కిలోమీటరు దూరంలో కానగ చెట్టు వద్ద దుర్వాసన వస్తుండటంతో పశువుల కాపరులు వెళ్లి చూడగా, గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. వెంటనే వెంకటాచలం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ గంగాధర్‌రావు, ఎస్సై అయ్యప్ప తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం బాగా కుళ్లిపోయి, గుర్తుపట్టలేని విధంగా మారిపోయింది. మృతుడు ఆత్మహత్య చేసుకున్నాడా, లేక ఎవరైనా కొట్టి చంపారా, అనారోగ్యంతో మృతి చెందాడా అనే విషయాలు తెలియలేదు. మృతుని శరీర భాగాలు కుళ్లిపోయిన విధానాన్ని బట్టి చనిపోయి 20 రోజులు గడిచి ఉంటుందని, వయస్సు 35 ఏళ్లు ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ హత్య కేసులో నిందితుడి అరెస్ట్



కోవూరు: కోవూరు సాలుచింతలు వద్ద ఇటుక బట్టీల వద్ద కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగించే నజీమా (49) హత్య కేసును పోలీసులు ఛేదించారు. దీనికి సంబంధించిన వివరాలను రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి కోవూరు సీఐ కార్యాలయంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కోవూరు సాలుచింతలు సమీపంలో నివాసముంటున్న నజీమా ఈ ఏడాది ఏప్రిల్ 1వ తేదీ తెల్లవారుజామున సహచర కూలీలతో కలిసి పనిచేసుకుంటోంది. అదే సమయంలో నెల్లూరు నవాబుపేటలో నివాసముంటున్న తాతా హరికిశోర్ నజీమా వద్దకు వచ్చి తాను పోలీసు అని, ఇక్కడ ఏమి చేస్తున్నావు అని ప్రశ్నించాడు. స్టేషన్‌కు రావాలని మందలించాడు. దీంతో అతను నిజంగానే పోలీసు అని భయపడిన నజీమా హరి కిశోర్ బైక్ ఎక్కింది. దీంతో అతను కోవూరు బజారు మీదుగా తీసుకెళ్లి సాయిబాబా గుడి వద్ద బైక్‌ను నిలిపాడు. ఆమెపై లైంగిక దాడికి యత్నించాడు. అందుకు నజీమా ప్రతిఘటించడంతో తలను రోడ్డుకేసి బలంగా కొట్టి అత్యాచారం చేశారు. ఈ క్రమంలో ఆమె మరణించడంతో అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీఐ రామకృష్ణారెడ్డి నేతృత్వంలో ఎస్సై దాసరి వెంకటేశ్వరరావు, సిబ్బంది కలిసి ఘటనా స్థలంతో పాటు పరిసరాల్లోని సీసీ కెమెరాలను పరిశీలించారు. చుట్టుపక్కల వారిని విచారించి నిందితుడు హరికిశోర్‌ను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా సీఐతో పాటు ఎస్సై, సిబ్బందిని డీఎస్పీ వీరాంజనేయరెడ్డి ప్రత్యేకంగా అభినందించి వారికి రివార్డులు అందజేశారు. ఎస్సై రమ్య, సిబ్బంది ఉన్నారు.

పెండింగ్‌లో ఉన్న పనుల పూర్తి

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 16వ డివిజన్లో గల జగదీష్‌నగర్, రామ్‌జీనగర్ ప్రాంతాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించిన సమయంలో పలు సమస్యలను స్థానికులు తెలియజేశారు. ఈ క్రమంలో సచివాలయ నిధులు రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనను బుధవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. జగదీష్‌నగర్‌లో డ్రెయిన్‌కు సచివాలయ నిధులతో శంకుస్థాపన చేశామని.. జగదీష్‌నగర్, రామ్‌జీనగర్ రోడ్డు పనులను త్వరలో ప్రారంభించనున్నామని చెప్పారు. డివిజన్లో పెండింగ్‌లో ఉన్న కొన్ని పనులకు త్వరలో టెండర్లు పిలవనున్నామని తెలిపారు. సర్వేపల్లి కాలువలోకి మురుగు రాకుండా గుర్రాలమడుగు సంఘం నుంచి మౌలా సాహెబ్ వీధి, అక్కడి నుంచి జాఫర్‌సాహెబ్ కాలువ వరకు భూగర్భ డ్రైనేజీని ఏర్పాటు చేసేందుకు అమృత్ పథకం ద్వారా నిధులను తీసుకొచ్చామని పేర్కొన్నారు. కార్పొరేటర్ వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కాలువల ఏర్పాటు

ప్రజలకు ఉపయోగపడేలా కాలువలను ఏర్పాటు చేస్తామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని 39వ డివిజన్లో గల మన్సూర్‌నగర్, పాముల మాన్యం, తదితర ప్రాంతాల్లో అధికారులతో బుధవారం పర్యటించిన ఎమ్మెల్యే స్థానిక సమస్యలను ఆరాతీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మన్సూర్‌నగర్ నుంచి వచ్చే డ్రెయిన్లు, గచ్చు కాలువ, తదితరాలు ప్రస్తుతం చాలా వరకు ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు. వీటికి సంబంధించి పూర్తిస్థాయి నివేదికను రూపొందించాల్సిందిగా అధికారులకు సూచించారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, నగరపాలక సంస్థ కో ఆప్షన్ సభ్యుడు చాట్ల నరసింహరావు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు మానికల సునీల్, నూనె ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

రాజగోపుర నిర్మాణానికి సహకరిస్తా



నెల్లూరు(బృందావనం): ఉమామహేశ్వరస్వామి దేవస్థాన తూర్పు రాజగోపుర నిర్మాణానికి తన వంతు తోడ్పాటును అందిస్తానని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. సీఏఎం హైస్కూల్ సమీపంలోని ఉమామహేశ్వరస్వామి దేవస్థానాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన వంశపారంపర్య ధర్మకర్త బాలాజీసింగ్ ఆధ్వర్యంలో దేవస్థాన ప్రధానార్చకుడు శ్రీనివాసులు ఎమ్మెల్యేను ఆహ్వానించారు. రాజగోపుర నిర్మాణానికి దాతలు ముందుకొచ్చారని, అయితే ఎదురుగా 33 కేవీ విద్యుత్ లైన్ వెళ్తున్న నేపథ్యంలో ఇబ్బంది ఏర్పడే అవకాశం ఉందని బాలాజీసింగ్ తెలియజేశారు. విద్యుత్ లైన్‌ను మార్చి రాజగోపుర నిర్మాణానికి సహకరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ వేలూరు మహేష్, జంగమ కార్పొరేషన్ చైర్‌పర్సన్ వావిలేటి ప్రసన్న, ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు శ్రీకాంత్, నాగమణి, సుభాన్‌సింగ్, ఈఓ కే పెంచలవరప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మోదీ హయాంలో దేశాభివృద్ధి



మాట్లాడుతున్న రమేష్‌నాయుడు

నెల్లూరు(మినీబైపాస్): ప్రధానిగా నరేంద్ర మోదీ బాధ్యతలు చేపట్టాక దేశం గణనీయంగా అభివృద్ధి చెందిందని పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు పేర్కొన్నారు. మినీబైపాస్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్ కుమార్‌యాదవ్, మొగరాల సురేష్, గడ్డం విజయ్‌కుమార్, మధు, కుడుముల గిరికుమార్‌గౌడ్, ప్రవీణ్, పొట్లూరి శ్రీనివాసులు, బీ శ్రీనివాసులు కందికట్ల రాజేశ్వరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్

బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడిగా ప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు నియామక ఉత్తర్వులను పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్ జారీ చేశారు.

4న ఎస్పీ బాలు జయంతి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి వేడుకలను జూన్ నాలుగున నిర్వహించనున్నామని సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక సంస్థ కార్యదర్శి యజ్ఞావఝుల శేషగిరీశం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సినీ సంగీత విభావరిని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.

5న అక్షరాభ్యాసం

నెల్లూరు(బృందావనం): శెట్టిగుంటరోడ్డులోని వీవర్స్ కాలనీలో గల పట్టాభిరామస్వామి దేవస్థానంలో అక్షరాభ్యాస మహోత్సవాన్ని జూన్ ఐదో తేదీన నిర్వహించనున్నామని దేవస్థాన కమిటీ సభ్యులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చిన్నారులకు అక్షరాభ్యాసాన్ని కవి ఆలూరు శిరోమణిశర్మ ఆధ్వర్యంలో నిర్వహించనున్నారని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పేర్లను దేవస్థానంలో నమోదు చేసుకోవాలని కోరారు.

జిల్లా ఉపాధి అధికారి బదిలీ

నెల్లూరు(మినీబైపాస్): జిల్లా ఉపాధి అధికారి ఏ సురేష్ కుమార్‌ను కడపకు బదిలీ చేస్తూ ఉత్తర్వులను ప్రభుత్వం బుధవారం జారీ చేసింది. దీంతో ఆయన విధుల నుంచి రిలీవయ్యారు.

నేటి నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ట మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం): నవాబుపేటలోని భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ట మహాకుంభాభిషేక మహోత్సవాలను గురువారం నుంచి శనివారం వరకు నిర్వహించనున్నామని ఈఓ నవీన్‌కుమార్, కార్యక్రమ పర్యవేక్షకుడు వంగాల శ్రీనివాసులురెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాసంకల్పం, గణపతిపూజ, పుణ్యాహవచనం, అఖండదీపారాధన, అంకురార్పణ, తదితర పూజా కార్యక్రమాలను గురువారం నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు విశేషంగా తరలిరావాలని కోరారు.

మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): పెన్నాలో పడి మృతి చెందిన వారి కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలని సీపీఎం జిల్లా, నగర కార్యదర్శులు మూలం రమేష్, కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఘటన స్థలానికి బుధవారం వారు చేరుకున్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగిందని ఆరోపించారు. బాధిత కుటుంబాలకు భరోసా ఇచ్చేంత వరకు మృతదేహాలను కదలనీ యబోమంటూ భీష్మించారు. దీంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ నేత కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి తన అనుచరులతో కలిసి చేరుకున్నారు.

రూ.ఐదు లక్షల పరిహారం

నెల్లూరు(క్రైమ్): బాధిత కుటుంబాలకు రూ.ఐదు లక్షల పరిహారాన్ని ఆర్డీఓ మలోల ప్రకటించారు. ఘటనపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు. దీంతో సీపీఎం నేతలు ధర్నాను విరమించారు. మృతదేహాలను పోస్ట్‌మార్టానికి తరలించారు.

వలంటీర్లకు సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని వెంకటేశ్వరపురంలో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. పునారావాస కాలనీలో గల మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో 53 / 1, 2 సచివాలయాల వలంటీర్లను సత్కరించారు. కార్పొరేటర్ దేవరకొండ సుజాత, వెంకటరమణ, శ్రీనివాసులురెడ్డి, కన్వీనర్లు నాగరాజు, బ్రహ్మారెడ్డి, బాలు, కరిముల్లా, ఆదిశేషమ్మ, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.



అంతా మా ఇష్టం..!



ఆర్టీసీ బస్టాండ్ లోపలికి బస్సులు వచ్చేందుకు.. తిరిగి వెళ్లేందుకు వీలుగా రెండు మార్గాలున్నాయి. అయితే డ్రైవర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ఒకే మార్గంలో రాకపోకలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో రెండు బస్సులు ఎదురెదురుగా వచ్చిన సందర్భాల్లో రోడ్డుపై ట్రాఫిక్ స్తంభిస్తోంది. ఎంట్రీ, ఎగ్జిట్ రెండూ ఒకే వైపు సాగిస్తుండటంతో బస్సులు ప్రమాదాలకు సైతం గురవుతున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



త్వరితగతిన కమాండ్ కంట్రోల్ పనులు



ఏసీ కూరగాయల మార్కెట్‌ను పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ కార్యాలయ ప్రాంగణంలో చేపట్టిన కమాండ్ కంట్రోల్ భవన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. భవన పనులను అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి, ఇంజినీరింగ్ విభాగాధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలో పారిశుధ్య పనుల పర్యవేక్షణ, నగరపాలక సంస్థలోని అన్ని విభాగాల సమావేశాలు, తదితరాలను ఈ భవనంలో నిర్వహించనున్నామని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యాలయంలోని అన్ని అంతస్తుల్లో సురక్షిత మంచినీటి సదుపాయాన్ని ఏర్పాటు చేసి, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉండేలా చేపట్టాలని సూచించారు. మైపాడు గేట్ సమీపంలో జనావాసాల మధ్య నిర్వహిస్తున్న పశువుల కేంద్రాన్ని తొలగించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కస్తూరిదేవి స్కూల్ ప్రాంగణంలో అక్రమంగా నిర్మిస్తున్న కల్యాణ మండపానికి నోటీసులను జారీ చేయాలని సూచించారు.

ప్లాస్టిక్ కవర్లు వాడితే జరిమానా

ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్లో ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నియంత్రించి, పరిశుభ్ర వాతావరణాన్ని కల్పించాలని కమిషనర్ పేర్కొన్నారు. ఏసీ సుబ్బారెడ్డి కూరగాయల మార్కెట్, రమేష్‌రెడ్డినగర్‌లోని గోశాల, కలెక్టరేట్ పరిసర ప్రాంతాల్లో జరుగుతున్న చెత్త సేకరణ పనులను అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరితో కలిసి ఆయన పరిశీలించారు. మార్కెట్ బయట రోడ్డు వెంబడి విక్రయాలు సాగించే వారు ఉదయం 7.30కు పరిసరాలను శుభ్రం చేసి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఖాళీ చేయాలని సూచించారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

శేషజీవితం హాయిగా సాగాలి



నెల్లూరు(క్రైమ్): ఉద్యోగ విరమణ పొందిన సిబ్బంది ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో శేషజీవితాన్ని గడపాలని ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కాంక్షించారు. ఉద్యోగ విరమణ పొందిన హోంగార్డులు సుగుణమ్మ, కామేశ్వరిని జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో ఏఎస్పీ హిమవతి, ఎస్పీ ఘనంగా సత్కరించారు. ఏఓ విజయ్‌కుమార్, హోంగార్డ్స్ డీఎస్పీ చంద్రమోహన్, ఆర్ఐ పాల్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇండస్ ఇండ్ బ్యాంక్ శాఖ ప్రారంభం



నెల్లూరు(బారకాసు): దర్గామిట్టలోని ద్వారకా ప్లాజాలో ఏర్పాటు చేసిన ఇండస్ ఇండ్ బ్యాంక్ నూతన శాఖను కమిషనర్ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఖాతాదారులకు ఆర్థిక భద్రతను కల్పిస్తూ ఉన్నతిని సాధించాలని కాంక్షించారు. బ్యాంక్ ప్రతినిధులు రమణ, సత్యనారాయణ, రమేష్‌బాబు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పొగాకుకు దూరంగా ఉందాం



రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిలో..



ఆర్టీసీ బస్టాండ్‌లో కరపత్రాల పంపిణీ

• ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సులు

నెల్లూరు (అర్బన్): పలు వ్యాధులకు కారణమయ్యే పొగాకుకు దూరంగా ఉందామని ఇండియన్ రెడ్ క్రాస్ కేన్సర్ హాస్పిటల్ సూపరింటెండెంట్ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని పొదలకూరు రోడ్డులోని రెడ్‌క్రాస్ కేన్సర్ ఆస్పత్రిలో అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. చీఫ్ మెడికల్ ఆఫీసర్ లక్ష్మి, రమేష్, తేజేశ్వర్, ఉషశ్రీ, లోకేశ్వరి, జనరల్ మేనేజర్ జుబేర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకొని అవగాహన సదస్సును పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నారాయణ డెంటల్ కాలేజీ సహకారంతో నిర్వహించారు. పొగాకుతో సంభవించే అనర్థాలపై కరపత్రాలను ఆవిష్కరించి ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు అందజేశారు. నారాయణ డెంటల్ కాలేజీ హెచ్‌ఓడీ కణ్ణన్, పీఎంపీ అధ్యక్షుడు వేణుగోపాల్, గౌరవాధ్యక్షుడు జయప్రకాష్, నేతలు శేషయ్య, వీరయ్య, చంద్రశేఖర్, డాక్టర్లు శివకుమార్, అజయ్‌కుమార్, చిరంజీవి, ఆర్టీసీ కంట్రోలర్ కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నెల్లూరు (టౌన్): భవిత కేంద్రాల ద్వారా ప్రత్యేకావసరాలు గల పిల్లలకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఐఈ కోఆర్డినేటర్ ధనమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 38 భవిత కేంద్రాల్లో ఆరు నుంచి 16 ఏళ్లలోపు గల విభిన్న ప్రతిభావంతులకు ఫిజియోథెరపిస్ట్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 2022 – 23 విద్యాసంవత్సరానికి గానూ అలవెన్స్ కింద జిల్లా వ్యాప్తంగా రూ.7.53 లక్షల విలువైన సీపీ, వీల్ చైర్లు, ట్రై సైకిళ్లను అందజేశామని పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 2800 మందికి సీడబ్ల్యూఎస్సెన్ ద్వారా స్టయిపండ్, ట్రాన్స్‌పోర్ట్, ఎస్కార్ట్, హెచ్‌బీఈ అలవెన్స్‌ల కింద వారి తల్లిదండ్రుల ఖాతాల్లో రూ.53.13 లక్షలను జమ చేశామని వెల్లడించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సీడబ్ల్యూఎస్సెన్ వివరాలను కచ్చితంగా నమోదు చేయాలన్నారు. వివరాలకు 86396 76371 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

వన్ గ్రామ్ ధగధగలు

• రోల్డ్ గోల్డ్ ఆభరణాలపై పెరుగుతున్న మక్కువ

• బంగారం కొనలేని వారికి వరం





వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలు

నెల్లూరు సిటీ: వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాలపై ఆదరణ నానాటికీ ఎక్కువవుతోంది. వాస్తవానికి పెళ్లిళ్లు, ఫంక్షన్లు వచ్చాయంటే సుందరంగా అలంకరించుకోవాలని చూస్తారు. బంగారు ఆభరణాలను ధరించాలని భావిస్తారు. అయితే బంగారు ధరలు రోజురోజుకూ కొండెక్కుతున్నాయి. ప్రస్తుతం బంగారు ఆభరణాల కొనుగోలు సామాన్యులకు తలకు మించిన భారంగా మారింది. అయితే మహిళలు తమకు నచ్చిన ఆభరణాలను వన్ గ్రామ్ గోల్డ్ ద్వారా కొనుగోలు చేస్తున్నారు. ఉదాహరణకు 50 గ్రాముల ఆభరణానికి ఐదు గ్రాముల బంగారం, రెండున్నర గ్రాముల తరుగు, కూలిని వసూలు చేస్తారు. వన్ గ్రామ్ గోల్డ్‌కు 8 లేక 10 క్యారెట్ల బంగారంతో పూత వేస్తారు. మిగిలినవి ఇతర ముడి పదార్థాలు ఉంటాయి. నీళ్లలో వాడితే త్వరగా నల్లబడతాయి. వీటిని 22 లేదా రెండు క్యారెట్ల బంగారంతో తాపడం వేయడంతో బంగారు ఆభరణాల కంటే ఎక్కువ ఆకర్షణీయంగా కనిపిస్తాయి. ఎక్కువ కాలం రంగుపోకుండా ఉంటాయి.

కొత్త మోడళ్లు..

మహిళలు ఎక్కువగా వన్ గ్రామ్ గోల్డ్ కొనుగోలుకు ఆసక్తి చూపుతుండటంతో వ్యాపారులు సైతం కొత్త మోడళ్లలో ఆభరణాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకొని విక్రయాలు సాగిస్తున్నారు. ఇళ్లకెళ్లి మరీ కొందరు వ్యాపారులు విక్రయాలు చేస్తున్నారు. వాయిదాల పద్ధతిలో సైతం విక్రయిస్తున్నారు. ఆన్‌లైన్లో సైతం కొనుగోళ్లు జరుగుతున్నాయి.

ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి

వన్ గ్రామ్ గోల్డ్‌ను ఎక్కువగా గుజరాత్, మహారాష్ట్రలో తయారు చేస్తారు. బంగారు నగలకు ఏ మాత్రం తీసిపోకుండా ఉండటంతో వీటికి మంచి డిమాండ్ ఏర్పడింది. ఆకర్షణీయమైన డిజైన్లలో గాజులు, చెవి కమ్మలు, నెక్లెస్, హారం, వడ్డాణం, ఉంగరాలు, బ్రాస్‌లెట్, తదితర ఆభరణాలు లభిస్తున్నాయి.

అద్దెకూ లభ్యం



వన్ గ్రామ్ గోల్డ్‌ను అద్దెకు సైతం ఇస్తున్నారు. పెళ్లి కూతుర్ని అలంకరించేందుకు వడ్డాణం, అరవంకీలు, హారం, నెక్లెస్, తదితరాలను రోజు ప్రాతిపదికన అద్దెకిస్తున్నారు. బంగారమంత విలువైనది కాకపోవడంతో ఎలాంటి భయం లేకుండా వీటిని అద్దెకు తీసుకునేందుకు పలువురు ముందుకొస్తున్నారు.